

వ్య.కా.స రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సంఘ గణపవరం మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ అన్నారు. రాష్ట్ర మహాసభ విజయవంతం కావాలని కోరుతూ సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో జల్లి కాకినాడలో గోడ పోస్టర్ విడుదల చేశారు. వ్యవసాయ కార్మిక సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న సంఘ రాష్ట్ర మహాసభ విజయవంతానికి వ్యవసాయ కార్మికులు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, నాయకులు సుబ్రహ్మణ్యం, ఎన్.హనుమంతరావు పాల్గొన్నారు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై
వేటు తప్పదా..!

పదేళ్లలోపు సర్వీసున్నవారిని తొలగించేందుకు ఆదేశాలు

ఆందోళనలో ఉమ్మడి జిల్లాలోని మూడువేల మందికి పైగా ఉద్యోగులు

పదేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులు 30శాతం వరకూ ఉన్నట్లు అంచనా

తమ పరిస్థితి ఏమిటంటూ అంతా లబోదిబో

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


తాము అధికారంలోకొస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామంటూ వైసిపి ఇచ్చిన హామీ నేడు గాలికొదిలేసింది. ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా ఉన్నవారిని తొలగించేందుకు పూనుకుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఆదేశాలు సైతం జారీచేయడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడువేల మందికిపైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లపై వేటు పడనుంది. ఇది ఇంతటితో ఆగుతుందా, ఇతర ఉద్యోగులపైన కూడా పడుతుందా అన్న అనుమానాలు నెలకొన్నాయి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికల్లో వైసిపి హామీ ఇవ్వడంతో, ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందని అంతా ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.12 వేల నుంచి రూ.20 వేలలోపు జీతాలు చెల్లిస్తున్నారు. పెరిగిన ఖర్చులతో జీతాలు ఏ మాత్రమూ చాలకపోయినా ఏదోఒకరోజు ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయనే ఆశతో వారంతా ఎదురుచూస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు రూ.లక్షల్లో జీతాలు అందుకుంటున్నప్పటికీ పనంతా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకే అప్పగిస్తారు. రాత్రీ, పగలు తేడా లేకుండా వీరంతా కష్టపడుతుంటారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న మూడువేలకుపైగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో పదేళ్లలోపు సర్వీసున్నవారు 30 శాతం మంది ఉన్నట్లు అంచనాలు వేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలు అమలు జరిగితే ఈ జిల్లాలోనే వెయ్యిమందికిపైగా ఉద్యోగులు ఇంటిబాట పట్టే అవకాశం ఉంటుంది. వీరిలో అత్యధికంగా 35 ఏళ్లు పైబడిన వారే ఉన్నారు. ఇన్నేళ్లు పనిచేసిన తర్వాత ఉన్న ఫళంగా తొలగిస్తే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని అంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు జారీ అయిన తర్వాత అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల్లో కంటిమీద కునుకులేకుండాపోయింది. తమ బతుకులు ఏదారి చేరతాయోనన్న భయం అందరినీ వెంటాడుతోంది. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు మీడియాలో వచ్చిన తర్వాత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దంటూ వైసిపి నాయకులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వపరంగా ఆదేశాలు మాత్రం జారీచేయలేదు. దీంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు వేస్తారా.. వెనక్కి తగ్గుతారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తేనే ఉద్యోగుల్లో ఆందోళనలు తొలగుతాయి. అలాకాకుండా ప్రభుత్వం బుజ్జగించే కబుర్లు ఎన్ని చెప్పినా ఉద్యోగుల్లో నమ్మకం కలిగే పరిస్థితి ఉండదు. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ఏమాత్రమూ కనికరం లేకుండా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఉద్యోగులను పర్మినెంట్ చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.



సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కుకునూరు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించి, మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి యర్రం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నా చేసి కో ఆర్డినేటర్ పోతురాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యర్రం సాయికిరణ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలని, గ్యాస్ సిలిండర్ కూడా ప్రభుత్వమే సరఫరా చేయాలని, సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్ పెంచాలని, పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఎపి మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నూతన విద్యావిధానంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఒకపక్క పనిభారం, మరోపక్క ధరల భారంతో పెరగని వేతనాలు, మెనూ ఛార్జీలతో కార్మికులు పథకం నిర్వహించడం కష్టసాధ్యంగా మారిందన్నారు. స్వచ్ఛంద సంస్థలకు పథకాన్ని అప్పగించరాదని, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో వాటిని రద్దుచేసి వర్కర్లతో పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 10 నెలలకే వేతనాలు ఇస్తున్నారని, 12 నెలలు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని సాయికిరణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు దుర్గమ్మ, ఆదిలక్ష్మి, పుష్పవతి, పుల్లమ్మ, లక్ష్మీకాంత, సీత, రాధ, భారతి పాల్గొన్నారు.


వినతిని అందిస్తున్న కార్మికులు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గోనె సంచులు ఇవ్వకుండా, రవాణాకు లారీలు పంపకుండా ధాన్యం కొనుగోలు ఆలస్యం జరగడంతో కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయి ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని సమ్మెటవారిగూడెం కల్లాల వద్ద అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై నిరసన తెలిపారు. తేమ శాతం నిర్ధారణ, గోనె సంచుల కొరకు చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల కల్లాల్లో ఉండిపోయిందన్నారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో లేవన్నారు. రైతులకు వెంటనే గోనె సంచులు అందించాలని కోరారు. బస్తాల్లోకి ఎక్కించిన ధాన్యాన్ని లారీల సమస్యతో తీసుకెళ్లకపోవడంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిల్వ ఉండిపోయిందన్నారు. ఆర్‌బికెల్లో 17 శాతం వచ్చిన ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత తేమశాతం ఎక్కువ ఉందని చెప్పి తరుగు పేరుతో రైతులు డబ్బులు చెల్లించాలని కోరడం దారుణమని విమర్శించారు. తేమ శాతం తరుగుకు సంబంధించి డబ్బులు చెల్లించకపోతే ధాన్యాన్ని ఆన్‌లోడ్ చేసుకోవడం లేదన్నారు. ఆర్‌బికెల్లోనే తేమ శాతాన్ని ఫైనల్ చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 1061 రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ మిగిలిన రకాల ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి సత్యనారాయణ, పల్లాటి చిన్నారావు, సంకు సత్యనారాయణ, పల్లాటి ఆదినారాయణ, ఎస్.సర్వేశ్వరరావు, బి.శేషారావు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

మద్దతు ధరల చట్టం తేవాలని వినతి

చింతలపూడి:కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకువచ్చేలా ఒత్తిడి తీసుకురావాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు ఎపి రైతు సంఘం తరపున ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు చింతలపూడి మార్కెట్‌యార్డ్ వద్ద సోమవారం సాయంత్రం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. రైతాంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం చేసిన పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం అనేక హామీలిచ్చి అమలు చేయలేదని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. పంటలకు కనీస ధర రాక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఈ పరిస్థితుల్లో సంపూర్ణ రుణ విముక్తి చట్టం తీసుకురావాలన్నారు. కేంద్ర విద్యుత్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

టిడిపిని భయపెట్టేందుకే హత్యారాజకీయాలు

మట్టి మాఫియాపై అధికారుల చర్యలు శూన్యం

టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ధ్వజం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను భయపెట్టేందుకే వైసిపి గుండాలు హత్యారాజకీయాలకు తెగబడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పోలీసులు కేవలం ఒక్కరోజు తప్పుకుంటే చాలని చింతమనేని వర్గమా? అబ్బయ్యచౌదరి వర్గమా? అనేది తేల్చుకుంటామని ఆయన సవాల్ విసిరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. దెందులూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలను భయపెట్టేందుకే శివబాబుపై హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఒకరిని చంపి పార్టీ శ్రేణులందరినీ భయపెట్టాలని చూస్తున్నారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తాము భయపడేది లేదన్నారు. దౌర్జన్యాలకు దిగడం తమకూ తెలుసునని, కానీ చట్టంపై నమ్మకం ఉంది కాబట్టి సమయమనం పాటిస్తున్నామన్నారు. తమను రెచ్చగొడితే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తమ కార్యకర్త శివబాబుపై జరిగిన హత్యాయత్నం ఘటనలో ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి పాత్ర ఉందని ఆరోపించారు. వైసిపిలో గుండాలను ఆయన పెంచిపోషిస్తున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లుగా పోలవరం గట్టు మొత్తాన్ని దోచుకుపోయారని, ఈ విషయం వెలుగులోకి తీసుకొస్తున్నామనే ఇలా దాడులకు పాల్పడుతున్నారన్నారు. మట్టి, గ్రావెల్‌ను దోచుకుపోతుంటే మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలవరం గట్టు వేసినప్పుడు ఎన్ని క్యూబిక్‌మీటర్ల గ్రావెల్ ఉండేది? ఇప్పుడు ఎంత ఉంది? అనేది మైనింగ్ అధికారులు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. శివబాబుపై దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చింతలపూడి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కొక్కిరగడ్డ జయరాజు, నేతల రవి, బొప్పన సుధాకర్ పాల్గొన్నారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభ షెడ్యూల్ ఇదే..

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా ఈ నెల ఆరో తేదీ ఉదయం పది గంటల నుండి స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో ఫొటో ఎగ్జిబిషన్, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని మహాసభ ఆహ్వానసంఘం కార్యదర్శి ఎ.రవి తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ షెడ్యూలు వివరాలను ఆహ్వానసంఘం కార్యదర్శి ఎ.రవి వివరించారు. ఈ నెల ఏడో తేదీ ఉదయం 11 గంటలకు కళాశాల, హైస్కూళ్లలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి సాయంత్రం ఐదు గంటలకు బస్టాండు పక్కన బహిరంగ ప్రదేశంలో సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గేయాల ఆలాపన వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరేటి వెంకన్న పాల్గొంటారని తెలిపారు. ఎనిమిదో తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు వేలాది మంది శ్రమ జీవులతో భారీ ప్రదర్శన మార్కెట్ యార్డ్ నుండి కొనసాగిస్తూ బస్టాండ్ పక్కన బహిరంగ ప్రదేశంలో సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభలో మాజీ ఎంపీ బృందాకరత్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, కేరళ ఎంపీ శివదాసన్, రైతు సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఉభయ గోదావరి జిల్లాల శాసన మండలి సభ్యులు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ ప్రసంగిస్తున్నారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు దండిమూడి రామలక్ష్మి కల్యాణమండపంలో ప్రతినిధులసభ ప్రారంభమవుతుందన్నారు. తొమ్మిదో తేదీ ఉదయం పది గంటలకు జరిగే ప్రారంభసభకు అందరూ ఆహ్వానితులే అని తెలిపారు. ఈ మహాసభ నిర్వాహణకు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌సిబి అదనపు జెడిగా సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరు జిల్లాకు ఎస్‌సిబి అడిషనల్ జాయింట్ డైరెక్టర్‌గా ఎన్.సూర్యచంద్రరావు విధుల్లో జాయిన్ అయిన సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అడిషనల్ జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావును అభినందించారు.

అంగన్‌వాడీలో అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరం అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం లక్కవరంలో పర్యటించిన అసిస్టెంట్ ట్రైనింగ్ కలెక్టర్ అపూర్వ భరత్ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు స్థానిక జెడ్‌పిహెచ్ స్కూలులో మధ్యాహ్న భోజనాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థులతో పాటు ఆయన కూడా మధ్యాహ్న భోజనాలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమీక్షించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్కవరం పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహార భద్రతకు ముప్పు..!

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్



గోదావరి జిల్లాలు అంటే పచ్చని పంట పొలాలు, పంటకాల్వలు, తాగునీటి చెరువులు, పాడి పశువులతో విరాజిల్లుతూ ఉండేది. కానీ నేడు ఆక్వా భూతం ఫలితంగా అవన్నీ కనుమరుగవుతున్నాయి. గతంలో పొలాల్లో పనిచేసే వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతులు అక్కడ ఉన్న పంటకాల్వలు, చెరువులో నీరు తాగేవారు. కాని ఇప్పుడు కాళ్లు చేతులూ కడుక్కునేందుకైనా ఉపయోగపడని పరిస్థితి ఏర్పడింది. నేడు ఏలూరు జిల్లాగా ఏర్పడిన ప్రాంతంలోని డెల్టా ఏరియా ఆక్వాభూతం కోరల్లో చిక్కుకొని కొట్టుమిట్టాడుతోంది.


ఏలూరు జిల్లాలోని డెల్టాలో తొమ్మిది మండలాల గ్రామాల పరిధిలో మొత్తం వరిసాగు లక్ష ఎకరాలు, చేపలసాగు లక్ష ఎకరాలు, రొయ్యల సాగు పది వేల ఎకరాలుగా ఉంది. ప్రస్తుతం రొయ్యలు, చేపలసాగు చేస్తున్న భూమి, వరిసాగు చేసేవారు. అప్పుడు అందరికీ పనులు పుష్కలంగా ఉండేవి. కానీ 1991 తర్వాత నూతన ఆర్థిక విధానాల ఫలితంగా యంత్రాల రాక, వాణిజ్య పంటల పేరుతో చేపలు, రొయ్యల ఎగుమతులు ఎక్కువయ్యాయి. దీని ఫలితంగా వ్యవసాయ కార్మికులకు పనులు లేకపోవడంతో పాటు గ్రామాల్లో తాగేందుకు నీళ్లు కూడా కరువయ్యాయి. అదే ఒక ఎకరం వరిసాగుకు రెండు పంటలకు సుమారు వంద మందికి పనిదినాలుండేవి. కానీ ఆక్వా చెరువులుగా తవ్విన ప్రాంతాల్లో పది పనిదినాలు కూడా ఉండటం లేదు. వరినాట్లకు ఎక్కువ మంది పేదలే వెళ్తున్నారు. డెల్టా ప్రాంతంలో ఇప్పటికే రెండు పంటలు పండే భూములు చౌడు భూములుగా మారిపోతున్నాయి. రెండు పంటలు పండే సారవంతమైన భూములను చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వకూడదని చట్టం చెబుతున్నా అధికారులు కాసులకు కక్కుర్తిపడి అనుమతులు ఇస్తున్నారు. దీనిఫలితంగా ఇప్పటికే డెల్టా ప్రాంతంలో జీవనదులు పంట కాల్వలన్నీ కాలుష్యకోరల్లో చిక్కుకున్నాయి. అనేక గ్రామాల్లో ఆక్వా కాలుష్యం వల్ల గాలీ, నీరు, ఆహారం కూడా కలుషితమై ప్రజలు శ్వాసకోశ, కేన్సర్, కిడ్నీ, చర్మవ్యాధుల బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారు. పంటలకు సక్రమంగా నీరు అందకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తమ భూములను అయినకాడికి అమ్ముకుంటున్నారు.

కాలుష్య కారక విధానాలను వ్యతిరేకించాలి

పిల్లి రామకృష్ణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి



వరి పంట నాశనం వల్ల ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఇది చాలదన్నట్లు ముఖ్యమంత్రి ఆక్వాజోన్‌గా మారుస్తానని ప్రకటించటం సిగ్గుచేటు. ఈ జిల్లాలో వరి సాగుభూములను ఉప్పునీటి కయ్యలుగా మార్చే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అందుకే పచ్చని పొలాలను, పంట కాల్వలను నాశనం చేసి ప్రజలకు, కూలీలకు, కౌలు రైతులకు ఉపాధిని దెబ్బతీస్తున్న ప్రభుత్వ మోసకారి విధానాలను అప్రమత్తతతో తిప్పికొట్టి జిల్లాను కాలుష్య కోరల నుండి రక్షించుకుందాం. ఆహార భద్రతను, ఉపాధిని, జిల్లా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ షేక్ సాబ్జీ

ఫిబ్రవరి 4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

వచ్చే ఏడాది ఫిబ్రవరి 4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవం-3 నిర్వహించడం చాలా సంతోషదాయకమని ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎంజిఎస్.వెంకటరత్నం, ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సభలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హేలాపురి బాలోత్సవం-3 ఫ్లెక్సీ, బ్రోచర్లను ఆవిష్కరించారు. సిఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్‌లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ గౌరవ అధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా లేళ్ల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా విజిఎంవిఆర్ కృష్ణారావు, కార్యదర్శిగా గుడిపాటి నరసింహారావు, అకడమిక్ అంశాలు నిర్వహణ కర్తగా షేక్ ముస్తఫా ఆలీ, కల్చరల్ అంశాలు నిర్వహణ కర్తగా డి.హేమసుందర్ వ్యవహరిస్తారని తెలిపారు. సభలో అడుసుమిల్లి నిర్మల, ఎంఎస్‌ఎంఎస్.కుమార్, మారుబోయిన కోటేశ్వరరావు, దేవరపల్లి బాలోత్సవం అధ్యక్షులు బి.సత్యనారాయణ, బిఎస్.ప్రకాశరావు, వై.ఆనందనాయుడు, వి.వెంకటేశ్వరరావు, మజ్జి కాంతారావు, మేతర అజయ్‌బాబు, కె.కృష్ణారావు, వి.సురేష్, శ్రీహరి కోటి, ఎస్.కస్తూరిరావు, పివి.నరసింహారావు, వి.కనకదుర్గ, ఎబి.త్రిపుర సుందరీ, వేమా హరి నారాయణ, ఎస్.రత్నకుమార్, ఎస్ఎన్.కట్టా, ఎన్.గంగాభవాని, వివి.ప్రసాద్, ఎస్.రవి పాల్గొన్నారు.

అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలి

'స్పందన'లో వినతులు స్వీకరించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

స్పందనలో వచ్చే అర్జీలు రిఓపెన్ అవడానికి ఆస్కారం లేకుండా అర్జీదారుల సంతృప్తిస్థాయి పెంచే విధంగా స్పందన అర్జీల పరిష్కారం ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీదారుల నుంచి 253 వినతులను కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఆర్‌ఒ ఎవిఎస్‌ఎస్.మూర్తి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

మండల స్థాయిలో ప్రత్యేకాధికారులు సమీక్షించాలి

మండలాల్లో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు ప్రగతిని సంబంధిత మండల ప్రత్యేకాధికారులు ఆయా మండలాల్లోని అన్ని శాఖల అధికారులతో ప్రతివారం సమీక్షించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. తద్వారా క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. గృహనిర్మాణాల పురోగతికి ప్రతి శనివారం 'హౌసింగ్ డే' నిర్వహించాలని, సంబంధిత మండల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు



ధర్నాలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు బదిలీలు కౌన్సెలింగ్ నిర్వహించాలని, రెండు నెలల క్రితం ప్రమోషన్ నిర్వహించిన వారికి ప్రమోషన్ ఉత్తర్వులు ఇవ్వాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు కౌన్సెలింగ్ జరపకుండా రెండు నెలల క్రితం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి వారికి ఉత్తర్వులు ఇవ్వకుండా ఖాళీలు పూర్తి చేయాలనే పేరుతో అక్రమంగా సర్దుబాట్లు పేరుతో ఉపాధ్యాయులను నిర్బంధంగా సర్దుబాటు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీల నిర్వహించాలని, ప్రమోషన్ తీసుకున్న వారికి ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు తెరిచేనాటికే రేషనలైజేషన్ బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించి పాఠశాల వ్యవస్థను సక్రమంగా నడపాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వహించకుండా చేతకానితనంతో ఆరు నెలలుగా వ్యవహరిస్తోందని దీనిని వెంటనే సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, కోశాధికారి షేక్ ముస్తఫా అలీ, కార్యదర్శులు బివి.రవీంద్ర, ఎన్.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి.అప్పారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శివశంకర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - ఏలూరు

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలు నుంచి జిల్లాలోని ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో ఓటర్ల జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి తప్పులు లేని సవరించిన ఓటర్ల జాబితా తయారీకి అధికారులు కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో క్లెయిమ్స్, అభ్యంతరాల కింద ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను పోలింగ్ బూత్ స్థాయి అధికారుల సహాయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వెంటనే పరిష్కరించాలన్నారు. గత 15 సంవత్సరాలలో జిల్లాలో చనిపోయిన వారి వివరాలను ఓటర్ల జాబితాలో తొలగించిఉన్నాయో లేదో పరిశీలించి వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలు, వలసలు తదితర కారణాలతో వెళ్లిన వారి వివరాలను కూడా పరిశీలించి వారి పేర్లపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి విజయరాజు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ షేక్‌షాహిద్, ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న సర్పంచి దాసం మేరి నవరత్నకుమారి

సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

సిఐటియు రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కైకలూరు సర్పంచి దాసం మేరి నవరత్నకుమారి పిలుపునిచ్చారు. జగ్గుతి పాఠశాల ఆవరణలో సోమవారం యుటిఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జనవరి మొదటి వారంలో భీమవరంలో నిర్వహించే సిఐటియు మహాసభకు రూ.ఐదు వేల విరాళాన్ని యుటిఎఫ్ నాయకులకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం నిర్వహించే సిఐటియు సభకు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రమేష్, ఏసురత్నం, రవికాంత్, చిట్టిబాబు, డి.ప్రసాద్, బిజె.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటి రుణం రూ.5 లక్షలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న కాలని లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం చింతలపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏ మాత్రం సరిపోవని, ప్రతి ఇంటికి కనీసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.



మాట్లాడుతున్న నాగరాజు

దుష్ప్రచారాలు నమ్మొద్దు : ఆలయ ఛైర్మన్ నాగరాజు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ఈ నెల రెండో జరిగిన షష్టి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెప్పోత్సవంలో అనుకోకుండా బాణాసంచా పేలి ఎనిమిది మంది గాయపడిన విషయాన్ని కొంతమంది రాజకీయం చేస్తూ లబ్ధి పొందాలని చూడడం సిగ్గుచేటని ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు అన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాయపడిన వారికి దేవస్థానం పూర్తి వైద్య సేవలు అందిస్తుందన్నారు. కొందరు వ్యక్తులు రాజకీయం కోసం సోషల్‌మీడియా, వారి అనుకూల పత్రికల ద్వారా దుష్ప్రచారం చేస్తూ భక్తులను భయంభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ పద్ధతి వారికి తగదన్నారు. కొందరు స్వార్థ రాజకీయ నాయకులు చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని నాగరాజు అన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నేల సంధ్య మాట్లాడుతూ ఈ ప్రమాదంలో గాయపడిన వారందరు క్షేమంగా ఉన్నారని, ఎవ్వరికీ ప్రాణహాని లేదని చెప్పారు. ఇప్పటికే నలుగురు డిశార్చి అయి ఇంటికి వచ్చారన్నారు. మరో రెండు రోజుల్లో మిగతా ఇద్దరు డిశార్చి ఆవుతారన్నారు. భక్తులు ఈ వదంతులు నమ్మవద్దన్నారు. ఈ నెల పదో తేదీన నిర్వహించే అఖండ అన్నసమారాదనలో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి అన్నప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని దాకారం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండవల్లికి చెందిన అన్నపరెడ్డి మణికుమార్ తన స్నేహితుడు సన్నీతో కలిసి ముదినేపల్లి మడంలం సింగరాయపాలెంలో జరుగుతున్న షష్టి ఉత్సవాలకు వచ్చాడు. అనంతరం తిరిగి రాత్రి 11 గంటల సమయంలో బైక్‌పై మండవల్లి వెళ్తుండగా మండలంలోని దాకారం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ వేగంగా వచ్చి మణికుమార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, సన్నీకి, మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ మణికుమార్‌ను 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యచికిత్స కోసం గుడివాడలోని మరో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మణికుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మణికుమార్ మండవల్లి గ్రామ సచివాలయంలో జెఎల్‌ఎంగా పని చేస్తున్నాడు.

బాలికపై అత్యాచారం

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని వట్టిగుడిపాడులో ఆరేళ్ల బాలికపై అదే గ్రామానికి 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం... వట్టిగుడిపాడు గ్రామానికి చెందిన బాలిక స్థానిక అంగన్‌వాడీ స్కూల్ వద్ద ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన యలమర్తి షద్రక్(45) ఆ పాపను తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరు దిశా పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి కేసు దర్యాప్తు చేపట్టారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో పలు చోట్ల విజిలెన్స్ అధికారులు దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ రంజితీకుమార్, సివిల్ సప్లై డిటి జరినా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కమలాపురం, రాఘవపురం గ్రామాల్లో దాడి చేసిన విజిలెన్స్ అధికారులు 38 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

ముసునూరు : మండలంలోని వేల్పుచర్ల శివారు అన్నపనేనివారిగూడెంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అన్నపనేనివారిగూడెం గ్రామానికి చెందిన గురజాల నాగబాబు తన మామిడితోటలో ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అతని కేసు నమోదు చేశారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఇబి అధికారులు తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రాకు ఆర్‌టిసి బస్సులో తరలిస్తున్న మూడు మద్యం సీసాలను పట్టుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని కె.శ్రీనివాసరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెం : ద్విచక్ర వాహనంపై అక్రమ మద్యాన్ని తీసుకెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. మసీదు వెనుక వీధిలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అల్లాడి రామకృష్ణ, చనమాల రాంబాబులను నిలుపుదల చేశామని తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెనుక ఉన్న చనమాల రాంబాబు పారిపోగా అల్లాడి రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనంతో పాటు రూ.32,420 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని విద్యాశాఖ అధికారి బెల్లం బాబూరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పేరుతో మార్చిన మెనూతో భోజనాన్ని పిల్లలు ఇష్టంగా తినడంలేదన్నారు. పాత మెనూనే కొనసాగించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరియం పోసమ్మ, బరగడ సత్యవతి, బక్క మహాలక్ష్మి, కొమరం అరవలమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్రభూషణం మాట్లాడుతూ ప్రభుత్వ కార్మికులను గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రతినెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20 పెంచాలని డిమాండ్ చేశారు. ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ హై స్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనాలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తొలుత ఎంఇఒ కార్యాలయంలో సిహెచ్.సతీష్‌కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విదన లక్ష్మి, పి.లలిత, ఎ.అంజలి, ఎం.జయమ్మ, కె.మంగ, పి.రమణ, కె.రామలక్ష్మి, అడప రమాదేవి, మేడిన సత్యవతి, తోట అన్నవరం, శీలం పల్లయమ్మ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాస్‌కు సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులను గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.అనసూయ, పి.రోసమ్మ, కమల, మురళి శ్రీ, సునీత పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో...

అంగన్‌వాడీలతోనే చిన్నారుల ఆరోగ్యం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని ఎంపిపి అడవి కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని ఆటపాక, దొడ్డిపట్ల గ్రామాల్లో అంగన్‌వాడీ నూతన భవనాల నిర్మాణాలకు ఆయన సోమ వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పేద పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో రెండు అంగన్‌వాడీ నూతన భవనాలకు అనుమతి తీసుకొచ్చారని చెప్పారు. భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి ఎంఎల్ఎతో ప్రారంభోత్సవం చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తలారి జాన్‌మణి, ఐసిడిఎస్ అధికారి లావణ్య పాల్గొన్నారు.

షేక్ నమియున్‌కు నీట్‌లో ర్యాంకు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం పాఠశాల పూర్వ విద్యార్థి, పొలసానిపల్లి గ్రామానికి చెందిన షేక్ నమియున్ హసేన నీట్ 2022లో ర్యాంకు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు కడప ఫాతిమా మెడికల్ కాలేజీలో సీటు కేటాయించినట్లు తెలిపారు. పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, షేక్ హసేన దంపతుల కుమార్తె నమియన్ హసేన ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు మానస పాఠశాలలో చదివారు. మంచిర్యాంకుతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. నమియున్ హసేన తండ్రి షేక్ హసేన సివిల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ చదివారు. ప్రస్తుతం దేశ స్థాయిలో గుర్తింపు పొందిన సిరమిక్ ఫ్యాక్టరీల్లో వివిధ నిర్మాణా కార్యక్రమాలను చేపడుతున్నారు. తల్లి రహీమా బేగం హసేన పట్టభద్రురాలు. మెడికల్ సీటు సాధించిన నమియున్ హసేన మాట్లాడుతూ చిన్నతనం నుంచి తన తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు అందించిన సహాయ సహకారాలు, ప్రోత్సాహకాల కారణంగా విద్యాపరంగా గుర్తింపు పొందానన్నారు. ఈ విషయమై మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం తన ఉన్నతకి పునాది వేశారన్నారు. ఎంబిబిఎస్ పూర్తయిన తర్వాత ఉన్నత విద్యాభ్యాసం చేస్తానని తన తల్లిదండ్రులు మాదిరిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.



షేక్ నమియున్ హసేన

చింతమనేని ప్రభాకర్ అనుచరుడిపై దాడి

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైసిపి, టిడిపి కార్యకర్తల బాహాబాహీ

బాధితుడిని పరామర్శించిన చింతమనేని సతీమణి, టిడిపి నేతలు

పెదవేగి మండలంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి తెలుగుదేశం పార్టీ నేత, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరునిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడడం ఉద్రిక్తలకు దారితీసింది. మట్టి మాఫియాను అడ్డుకునేందుకు వెళ్లిన వ్యక్తిని హతమార్చాలనే ఉద్దేశంతో ఈ దాడి జరిగిందంటూ తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడే ఉన్న వైసిపి కార్యకర్తలకు, టిడిపి కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు ఒకరిపై మరొకరు దాడులకు దిగేవరకూ తీసుకొచ్చింది. పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

పెదవేగి మండలం భోగాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అనుచరుడు ఎర్రజర్ల శివబాబు ఆదివారం రాత్రి సమయంలో కొప్పాక గ్రామానికి శివారు ప్రాంతంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని తెలుసుకుని అక్కడికి వెళ్లాడు. అయితే అక్కడ ఉన్న కొందరు శివబాబుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయాలపాలైన అతడిని అక్కడివారు చికిత్సనిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న చింతమనేని సతీమణి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి బాధితుడిని పరామర్శించారు. దీంతో విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఆసుపత్రి వద్దనున్న వైసీపీ కార్యకర్తలతో వాగ్వివాదానికి దిగారు. ఇదికాస్త ముదరడంతో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డారు. దీంతో స్పందించిన పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ బడేటి రాధాకృష్ణ (చంటి), జెడ్‌పి మాజీ ఛైర్మన్ కొక్కిరగడ్డ జయరాజు శివబాబును పరామర్శించారు. అనంతరం ఆయనను మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టిడిపి నేతలపై ఫిర్యాదు చేయడంలో నిర్లక్ష్యంపై వైసిపి నిరసన

ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఒ నిర్బంధం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ పార్టీకి చెందిన కార్యకర్తలపై దాడికి పాల్పడిన టిడిపి కార్యకర్తలపైన, నాయకులు పైన ఆసుపత్రి అధికారులు కనీసం ఫిర్యాదు చేయకపోవడం బాధాకరమని వైసిపి నాయకులు కొఠారు రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగి మండలం కొప్పాక ఘటనపై ఆసుపత్రి ఆవరణలోనే వైసిపి కార్యకర్తలపై దాడికి పాల్పడిన టిడిపి కార్యకర్తలపైన ఫిర్యాదు చేయకపోవడంపై నిరసనగా సోమవారం రాత్రి ఏలూరు ప్రభుత్వ ఆర్ఎంఒ కార్యాలయం వద్ద వైసిపి నేతలు నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆర్ఎంఒ తమకు సమాధానం చెప్పాలంటూ ఆయన ఛాంబర్‌లోనే బయట నుంచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ఈ సంఘటన జరిగి 24 గంటలు గడిచినా ఇప్పటికీ పోలీసులకు ఆసుపత్రి అధికారులు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. సీసీ కెమెరాల ఆధారంగా తమ కార్యకర్తలపై దాడికి ఎవరు పాల్పడ్డారో గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంఒ స్పందిస్తూ ఈ సంఘటనపై అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది ఇప్పటివరకు తనకు ఫిర్యాదు చేయలేదని, అందువల్లే పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఆయన చెప్పిన సమాధానంపై రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా బాధ్యత రాహిత్యమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆర్ఎంఒ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గురుకుల పాఠశాల మంజూరు చేయాలని వినతి


ప్రజాశక్తి - చాట్రాయి

మండలానికి బాలుర గురుకుల పాఠశాలను మంజూరు చేయాలని ఎంఆర్‌పిఎస్ వర్కింగ్ కమిటీ మండల అధ్యక్షులు బిలుగుది బాబూరావు కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన చాట్రాయిలో గతంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం నిర్వహించారని, గత ప్రభుత్వ సమయంలో దానిని నిలిపివేశారని తెలిపారు. దీంతో వెనుకబడిన తరగతుల విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అలాగే పబ్లిక్ టాయిలెన్స్ నిర్మించాలని కోరారు. ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్‌కు, చాట్రాయి గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచి దామెర ఉషకు వినతిపత్రం అందించారు.

మండలంలోని జనార్ధనవరం తూర్పు దళితవాడకు శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కూలి సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తూర్పు దళితవాడలో 150 కుటుంబాలు నివసిస్తున్నారని, శ్మశాన వాటిక లేక అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు స్పందిస్తూ వెంటనే స్థలాన్ని సేకరించి సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.

కొయ్యలగూడెం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిసి సెల్ మండల అధ్యక్షులు గంగుల నాగు ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బిసి కమ్యూనిటీ భవనాలు, బిసిలను ఆదుకునే చర్యలు ఏమాత్రం చేపట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అధ్యక్షులు నిమ్మగడ్డ రవీంద్ర, పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు, నల్లూరి గోపికృష్ణ, నిమ్ము జగదీష్, దారం రవి, చిన్ని మాస్టర్, కొండ్రెడ్డి పూర్ణ, నిమ్మగడ్డ మహేష్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : జాతీయ రహదారి, ఏలూరు కాలువ గట్టు వెంబడి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న ఆక్రమణలను ఖాళీ చేయాలని అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా ఆపాలంటూ నారాయణపురం బాధితులు సోమవారం స్పందనలో వినతిపత్రం అందించారు. లోకాయుక్త ఆదేశాలపై ఆక్రమణలను ఖాళీ చేయాలంటూ అధికార యంత్రాంగం రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం నారాయణపురం కాలువ గట్టు వెంబడి పోలీసు స్టేషన్‌రోడ్డులో పలు పాకలు, గడ్డివాములను జెసిబితో అధికారులు తొలగింపు పనులను చేపట్టారు. ఈ క్రమంలో స్పందనలో వినతిపత్రం అందించారు.



చాట్రాయిలో...

వైసిపి పాలనతో రాష్ట్రం అధోగతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతి పాలైందని టిడిపి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బడేటి చంటి ధ్వజమెత్తారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రచ్చబండ కార్యక్రమం స్థానిక 42వ డివిజన్ కొత్తపేట పాత వాటర్ ట్యాంక్ వద్ద నుంచి సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేంతవరకు పోరాడతామని చెప్పారు. అనంతరం బడేటి చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరని, ఈ అరాచక పాలన ఎప్పుడు వదులుతుందా అని ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లెపు రాము, డివిజన్ ఇన్‌ఛార్జి త్రిపర్ణ రాజేష్, అర్నెపల్లి మధు, శెట్టి సరిత, కర్రీ రమేష్ పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాల కల్పనకు 'పోరుబాట'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించే వరకూ తమపోరాటం ఆగదని టిఎన్‌ఎస్‌ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్‌యాదవ్ అన్నారు. తెలుగు విద్యార్థి సంక్షేమ హాస్టల్లో పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా సంక్షేమ హాస్టల్ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గత నెల 21నుంచి 30వ తేదీ వరకూ జిల్లాలోని కొన్ని వసతి గృహాలను పరిశీలించామని చెప్పారు. చింతలపూడిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సంక్షేమ గురుకుల పాఠశాలలో శాశ్వత వసతి గదులు లేక విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యంగా సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించడం లేదన్నారు. పురుగులతో కూడిన అన్నాన్ని విద్యార్థులకు పెడుతున్నారని చెప్పారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని సంక్షేమ హాస్టల్లో రక్షిత మంచినీరు అందించాలని కోరుతున్నామని తెలిపారు. విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. అనంతరం జెసికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విద్యార్థి ఏలూరు నియోజకవర్గ అధ్యక్షులు వేగి సిద్దు, కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు మోరు రామరాజు, నాయుడు పవన్, కోలుసు జయంత్,సైదు సతీష్, జగత్ పాల్గొన్నారు.

బిసిలకు న్యాయం చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి ప్రభుత్వం బిసిలకు రావాల్సిన నిధులు మంజూరు చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని టిడిపి మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి మండల, పట్టణ బిసి సెల్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ మండల అధ్యక్షుడు సాయల సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బిసిలంతా టిడిపి వెన్నంటే ఉండి చంద్రబాబును సిఎం చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ అనాదిగా బిసిలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు ఉంటే వైసీపీ ప్రభుత్వం వచ్చాక 24 శాతానికి తగ్గించిందన్నారు. రాయితీ రుణాలు లేకుండా చేశారన్నారు. రూ.36 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ స్లీవ జోజికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ పట్టణ, మండల అధ్యక్షులు పాకనాటి అంజి, బూసా సత్యనారాయణ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి తూటికుంట రాము, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు చిల్లపురెడ్డి ఇంద్రాణి, మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, ఎస్ఎస్.ఇస్మాయిల్, పైడి రాజు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టిన నాటి నుంచి బిసి సామాజిక వర్గంపై దాడులు పెరగటంతో పాటు అణిచివేతకు గురవుతుందని టిడిపి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించి తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బిసిలకు వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు బిసిలకు ఇదేం ఖర్మ పేరుతో టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించి తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 56 శాఖలకు నిధులు కేటాయించి అమలు చేయాలని షరతులు లేకుండా విదేశీ విద్యను కొనసాగించాలని, బిసి నేతలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి, బిసి సీనియర్ నాయకులు పాపాచార్యుల వీరేశలింగం, గండబోయిన వెంకట్రావు, మండల బిసి సెల్ ఉపాధ్యక్షులు చెన్ను శివ పాల్గొన్నారు.

వికలాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అనాధ బాలలకు, అంధ బాలలకు ఆశ్రయం కల్పించటంతో పాటు ఆరోగ్యాన్ని, విద్యను అందించడమే కాకుండా వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం ఎంతో అభినందనీయమని రాష్ట్ర సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఐఎఎస్ అన్నారు. హీల్ ప్యారడైజ్‌లోని కృత్రిమ అవయవ కేంద్రంలో సోమవారం ఆయన విజయవాడకు చెందిన ఓరుగంటి వెంకటేశ్వరరావు, ఆగిరిపల్లి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన చింతల వీరయ్యలకు కృత్రిమ కాళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ కె.అజయ్‌కుమార్, మరో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.శ్రీనివాసులు రెడ్డి, హీల్ సంస్థ హెచ్ఆర్.మేనేజర్ పివి.రవి, సీనియర్ టెక్నీషియన్ సన్నీజాన్, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ కార్యాలయంలో సోషల్ ఆడిట్

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల ఆరో తేదీ మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఎపిఒ జయప్రసాద్ తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లోని ఉపాధి హామీ 2021-2022వ సంవత్సరకాలం సోషల్ ఆడిట్ నివేదికపై ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ముసునూరు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల ఆరో తేదీ మంగళవారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల శాఖాధికారులు హాజరు కావాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ కోరారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా జానకిరెడ్డి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి పుట్టినరోజు వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. చింతలపూడి పట్టణంలో లిబర్టీ చిల్డ్రన్ హోం అనాథశ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం ఎఎంసి వద్ద ఎంపి శ్రీధర్‌బాబు సమక్షంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నుంచి పలువురు అధికారులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.